

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్

కడపలో జరుగుతున్న ఏసీఏ–సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. -8లో



స్థల వివాదంతోనే వ్యాపారి హత్య

స్థల వివాదమే స్థిరాస్తి వ్యాపారి రామమోహన్‌రెడ్డి (48) హత్యకు కారణంగా పోలీసులు నిర్ధారణ చేశారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.8/28.5

జిల్లాలో మంగళవారం 28.5 - 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు ఉద్యోగ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో గురువారం ఉదయం నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులై ఉండి 18–35 ఏళ్లలోపు అర్హులని వివరించారు. వివరాలకు 9908051624 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

అర్చకుల వంశ పారంపర్య హక్కు నమోదు

కడప కల్చరల్ : జిల్లాలోని దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలోగల 6సీ దేవాలయాలలో పని చేస్తున్న వంశ పారంపర్య హక్కు నిర్ధారణ కోసం అర్చకులు నిర్ధారణ రిజిష్టర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి సి.శంకర్‌బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో తమ శాఖ పరిధిలోని దేవాలయాలలో పనిచేస్తున్న అర్చకులు తమ దరఖాస్తులను ఐదు రోజుల్లోపు అందజేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డా. బి.ఆర్. అంబేడ్కర్ ఓపన్ యూనివర్సిటీ ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ (154) కో–ఆర్డినేటర్ ఎం. వీరభద్రయ్య తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ జారీ అయిందని పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ, ఓపన్ ఇంటర్, పాలిటెక్నిక్, డిప్లొమో కోర్సులు పూర్తి చేసినవారు ప్రవేశాలకు అర్హులని వివరించారు. ఈనెల 31వ తేదీలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈశ్వర రామాలయం సందర్శన

రాజుపాళెం : ధూప, దీప నైవేద్యం మంజూరు కోసం రాజుపాళెంలోని పురాతన ఈశ్వర రామాలయాన్ని మంగళవారం సాయంత్రం దేవదాయ ధర్మదాయ శాఖ తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ విజయ సాగర్ బాబు పరిశీలించారు. నిర్మాణ వివరాలను అర్చకుడు నాగేంద్ర శర్మ, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ నరసింహాసింగ్ తదితరులున్నారు.

ముగిసిన ఏడీసెట్-23 ప్రవేశాలు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏడీసెట్ (ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)–23 ప్రవేశాల ప్రక్రియ మంగళవారం ముగిసింది. సెట్ చైర్మన్, విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, కన్వీనర్, రిజిస్ట్రార్ ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మార్గదర్శనంలో నిర్వహించిన ఈ ఎంపికలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు ప్రవేశాలు పొందారు. రెండురోజుల పాటు నిర్వహించిన ఈ ప్రవేశాల ప్రక్రియలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్‌లో పెయింటింగ్, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్, శిల్పం కోర్సుల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

అజ్ఞానవాసిపై ఆగ్రహజ్వాల

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై నిరసనలు మిన్నంటాయి. జిల్లావ్యాప్తంగా వలంటీర్లు రోడ్లపైకొచ్చి ఆందోళనలు చేశారు. పలుచోట్ల దిష్టిబొమ్మలు దహనం చేశారు. రీల్ లైఫ్‌లో నాలుగు డైలాగులు చెప్పి హీరోగా చెలామణి అయ్యే పవన్‌కల్యాణ్ రియల్ లైఫ్‌లో 'పచ్చ' పైత్యం ఎక్కువై పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. స్వచ్ఛంద సేవపై నీచంగా మాట్లాతున్న జనసేనాని నిజంగా 'అజ్ఞానవాసి'గా నిరూపించుకున్నాడన్నారు. వలంటీర్లకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

- 'పచ్చ'పైత్యంతో పిచ్చెక్కి మాట్లాడుతున్నాడు..
- ధ్వజమెత్తిన వలంటీర్లు
- బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్



రైల్వేకోడూరులో పవన్ కల్యాన్ దిష్టిబొమ్మతో భారీ ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పూలంగళ్ల సర్కిల్ వరకు వలంటీర్లు పవన్ దిష్టి బొమ్మను ర్యాలీగా తీసుకొచ్చారు. పవన్ కళ్యాణ్ డౌన్ డౌన్.. వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. అనంతరం పూలంగళ్ల సర్కిల్ వద్ద పవన్ కళ్యాణ్ దిష్టి బొమ్మను చెప్పులతో కొట్టి నిప్పంటించారు.

క్షమాపణలు చెప్పాల్సిందే..

గోపవరం : ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ నిస్వార్థంగా పనిచేస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. రాచాయపేట సచివాలయం వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రవిచంద్రారెడ్డి, తిరుపాల్, సాంబశివారెడ్డి తదితరులు మద్దతుగా నిలిచారు.

కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

గాలివీడు: మండల కేంద్రంలో మండల ఉపాధ్యక్షులు యదుభూషన్‌రెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు పవన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. జేఏసీ సభ్యులు ఖాదర్ మోహ్దీన్, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు. కోడూరులో వలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బద్వేలు అర్బన్: నిస్వార్థంగా సేవ చేస్తున్న తమపై జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇకపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చూస్తూ ఊరుకోమని వలంటీర్లు హెచ్చరించారు. ఆర్ అండ్‌బీ బంగ్లా నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా వలంటీర్లు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేపట్టారు. వలంటీర్ అసోసియేషన్ నాయకులు మహేశ్వరి, ప్రసన్న, సౌజన్య,సుబ్బయ్య పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

చాపాడు : చాపాడు నాలుగు రోడ్ల కూడలిలో వలంటీర్లు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఎంపీపీ తెలిదెల లక్షుమయ్య మాట్లాడుతూ పవన్ వలంటీర్లపైన అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

వలంటీర్ల నిరసన ర్యాలీ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల పట్టణంలో వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేసి, అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ గురప్ప, మండల ఉపాధ్యక్షుడు బాషా, మాజీ సర్పంచ్ బూతప్ప, ఎంపీటీసీ ఇస్సాక్, బాబు పాల్గొన్నారు.

చెప్పుతో కొట్టి..

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం నాలుగురోడ్ల కూడలిలో వలంటీర్లు పవన్ కళ్యాణ్ ఫొటోను చెప్పుతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు.

యాత్రలను అడ్డుకుంటాం

కమలాపురం : పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పకుంటే యాత్రలను అడ్డుకుంటామని వలంటీర్లు హెచ్చరించారు. పట్టణంలోని నిరసన వ్యక్తం చేశారు.

దమ్ములేక దుర్మార్గపు వ్యాఖ్యలా...

ఎర్రగుంట్ల : పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు సిగ్గు చేటని వలంటీర్లు ధ్వజమెత్తారు. మంగళవారం నిరసన తెలిపారు. దిష్టి బొమ్మను దహనం చేశారు.

పవన్ యాత్రలను అడ్డుకుంటాం



పవన్ కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలి. లేకుంటే పవన్ రాష్ట్రంలో చేపట్టే యాత్రలను అడ్డుకుంటాం. –శ్రావణి, వలంటీర్, కమలాపురం

పవన్‌కు బుద్ధి చెబుతాం



కోవిడ్ సమయంలో వలంటీర్లు ఒక సైనికులుగా ప్రజలకు సేవలు అందించారు. ఆ సేవను గుర్తించలేని మూర్ఖుడు పవన్ కల్యాణ్. వలంటీర్ వ్యవస్థను విమర్శించడం తగదు. – రఘురాముడు, వలంటీర్, ఎర్రగుంట్ల.



ఎర్రగుంట్ల: పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



కమలాపురం: పవన్ కల్యాణ్ చిత్రపటాలకు నిప్పు పెడుతున్న వలంటీర్లు



చాపాడు నాలుగు రోడ్ల కూడలిలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

ప్రతిష్టాత్మక వ్యవస్థపై ఆరోపణలు దారుణం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిందారోపణలు చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు మండిపడ్డారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోవిడ్–19 సమయంలో వలంటీర్లు అందించిన సేవల వల్లే కరోనా మహమ్మారిని నియంత్రించ గలిగామని, దేశ ప్రధాని నరేంద్రమోదీ కూడా వారి సేవలను కొనియాడారని గుర్తు చేశారు. ప్రతినెలా ఒకటోతేది తెల్లారుజామునే అవ్వాతాతలకు వారి ఇంటి తలుపుతట్టి పింఛన్లు అందజేయడమేగాక, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కేవలం రూ.5వేల గౌరవ వేతనంతో సేవలందిస్తున్న వారిపై పవన్ కళ్యాణ్ నీచంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వలంటీర్ల వల్లే 17వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని పవన్ చెప్పడం అన్యాయమన్నారు. ఇంతమంది అదృశ్యమైతే ఒక్క పోలీస్‌స్టేషన్‌లో అయినా కేసు నమోదు కాలేదా అని ప్రశ్నించారు. ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉండి ఇలా చిల్లర మాటలు మాట్లాడటం బాధాకరమన్నారు. పవన్ పద్ధతిగా మాట్లాడటం నేర్చుకోవాలని, ఇలాగే మాట్లాడితే జనం చెప్పులతో తరిమికొడతారని హెచ్చరించారు. వలంటీర్లకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, ఎస్. రాము, సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, తోటక్రిష్ణ, దత్తసాయి పాల్గొన్నారు.

డిసెంబరు లోపు పాడా అభివృద్ధి పనులు పూర్తి



పాడా అభివృద్ధిపై సమీక్షిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: పాడా పరిధిలో పులివెందుల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు డిసెంబరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వియరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన హాలులో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ వేగంగా, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మెడికల్ కాలేజీ పనులతోపాటు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, హౌసింగ్, వ్యవసాయ, మార్కెటింగ్ తదితర శాఖలకు సంబంధించి జరుగుతున్న పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయడానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ రూములకు బహిరంగ వేలం

చక్రాయపేట : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం 44షాపింగ్ కాంప్లెక్స్ రూములకు సంబంధించి బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాట ద్వారా 35 రూములకు సంబంధించి నెలకు రూ.3.21లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి తెలిపారు. మిగిలిన 9 రూములకు వేలంపాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా పడింది. వాటికి కూడా త్వరలోనే వేలం నిర్వహిస్తామని వెల్లడించారు. దేవదాయ శాఖ అధికారి ప్రసాదరావు, ఆలయ చైర్మన్ పి.రాఘవేంద్రప్రసాద్, పాలక మండలి సభ్యులు అర్చకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గండి దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి

కుటుంబ నియంత్రణ పాటిద్దాం

కడప రూరల్: కుటుంబ నియంత్రణను పాటించి అధిక జనాభాకు అడ్డుకట్ట వేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ర్యాలీ చేశారు. అనంతరం కోటిరెడ్డి కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ ఎం వెంకటచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడప కోటిరెడ్డి సర్కిల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

ఇంధన పొదుపుపై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి డ్రైవర్ ఇంధన పొదుపుపై దృష్టి సారించి సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేయాలని కడప జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర రావు తెలిపారు. మంగళవారం కడప రీజియన్‌లో అత్యల్ప ఇంధన పొదుపు, ప్రమాద రహిత శిక్షణ తరగతులను నిర్వహించారు. చిన్న చిన్న జాగ్రత్తలు వహించడం ద్వారా ఇంధనాన్ని ఎలా పొదుపు చేయవచ్చో ఈ సందర్భంగా ఈడీ వివరించారు. ఆర్ఎం గోపాల్‌రెడ్డి, సీఎంఈ లక్ష్మీభాస్కర్, బద్వేలు డిపో మేనేజర్ జేఎస్ రావు, ట్రైనర్ కృష్ణారెడ్డి, ఇతర డ్రైవర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

మార్కెట్ కమిటీలకు లక్ష్మీ కళ!



కడప మార్కెట్ యార్డు



- జిల్లాలో వేగంగా మార్కెట్ సెస్ వసూలు
- 2023-24 ఏడాది లక్ష్యం రూ. 11.61 కోట్లు
- మూడు నెలలకే రూ.3.61 కోట్లు వసూలు
- మార్చి చివరి నాటికి లక్ష్యం చేరుకునేలా అడుగులు

కడప అగ్రికల్చర్: జిల్లాలోని మార్కెట్ కమిటీల్లో కాసుల గళగళలు వినిపిస్తున్నాయి. సెస్సు వసూళ్లతో కొత్త కళ సంతరించుకున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మార్కెట్ కమిటీల్లో సెస్సు వసూళ్ల ముమ్మరంగా జరుగుతున్నాయి. 2023–24 ఏడాదికి రూ. 11.61 కోట్లు మార్కెట్ సెస్సు వసూలు లక్ష్యం కాగా.. జూన్ చివరి నాటికే రూ. 3.61 కోట్లు సెస్సు వసూలు అయింది. గతేడాది ఇదే జూన్ చివరి నాటికి 3.08 కోట్లు వసూలైంది.

కడప, బద్వేల్ ఏఎంసీలు మినహా...

జిల్లాలో పది మార్కెట్ కమిటీల్లో కడప, బద్వేల్ మార్కెట్ కమిటీలు తప్ప మిగతా ఎనిమిది మార్కెట్ కమిటీలు వసూళ్లలో జోరు చూపిస్తున్నాయి. కడప మార్కెట్ కమిటీ లక్ష్యం ఈ ఏడాది రూ. 185 లక్షలు కాగా ప్రస్తుతం రూ.44.02.45 లక్షలు వసూలు చేసింది. అలాగే బద్వేల్ మార్కెట్ కమిటీ లక్ష్యం రూ. 155 లక్షలు కాగా.. ఇప్పటికి రూ. 57.54 లక్షలే వసూలు చేసి వెనుకంజలో నిలిచింది. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, బద్వేల్, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, కమలాపురం, ఎల్ఆర్‌పల్లె, సిద్దవటం, ఎర్రగుంట్లలో మార్కెటింగ్ కమిటీలు ఉన్నాయి. ఇందులో కడప మార్కెట్ కమిటీలో పసుపు, వేరుశనగకు సంబంధించిన క్రయవిక్రయాలు జరుగగా మిగతా మార్కెట్ కమిటీల్లో పండ్లు ఇతర ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతాయి.

జిల్లాలో ఉన్న మార్కెటింగ్ కమిటీలు:	10
జిల్లాలో చెక్ పోస్టులు:	21
మార్కెట్ కమిటీల నుంచి లైసెన్సులు తీసుకున్న వ్యాపారులు:	552

జిల్లాలో 21 చెక్ పోస్టులు....

జిల్లాలో పది మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 21 చెక్ పోస్టులు ఉన్నాయి. సాధారణంగా జిల్లాలో కడప మార్కెట్ కమిటీ నుంచే ఎక్కువగా సెస్ వసూలు అవుతుంది. కానీ ఈ ఏడాది ప్రభుత్వం పసుపు కొనుగోలును మార్కెఫెడ్‌కు అప్పగించడంతో సెస్ వసూలు తగ్గింది. అలాగే బద్వేల్ ఏఎంసీ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు సరిగా జరగని కారణంగా వసూళ్లలో వెనుకంజలో ఉంది. మిగతా 8 మార్కెట్ కమిటీలలో చెక్‌పోస్టుల్లో వసూళ్లు బాగా ఉన్నాయి.

లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు..



జిల్లాలో 2023–24 ఏడాదికి 10 మార్కెట్ కమిటీల పరిధిలో 21 చెక్ పోస్టులు ఉన్నాయి. ఆయా చెక్ పోస్టుల ద్వారా వార్షిక ఆదాయం ఏడాదికి రూ. 11.61 కోట్లు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతానికి సెస్సు వసూలు ఆశాజనకంగా ఉంది. ఇచ్చిన టార్గెట్‌లో ఇప్పటికే 31.15 శాతం వసూలు చేశాం. మిగతా మొత్తాన్ని మార్చి చివరి నాటికి లక్ష్యాన్ని అధిగమించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. – ఆజాద్ వల్లి, మార్కెటింగ్‌శాఖ ఇన్‌చార్జి ఏడీ, వైఎస్సార్‌జిల్లా

ఉపాధ్యాయ సంఘాల వింత పోకడలకు నిరసన

ఫ్యాప్టో ట్రెజరర్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి చెన్నకేశవరెడ్డి రాజీనామా



చెన్నకేశవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తోందని.. అయినా ఉపాధ్యాయ సంఘాలు వింతపోకడలు అవలంబిస్తున్నాయంటూ ఫ్యాప్టో నాయకుల వైఖరికి నిరసనగా ట్రెజరర్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవులకు జి.చెన్నకేశవరెడ్డి మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కరోనా కష్టకాలం నుంచి తేరుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ప్రభుత్వం తీసుకెళుతోందని, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లిస్తోందని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉపసంఘం వేసి పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. వీటితో పాటు నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి ప్రవేటు పాఠశాలలు సైతం అబ్బుర పడేలా అభివృద్ధి చేస్తోందన్నారు. పలురకాల పథకాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో ఒక సుస్థిర లక్ష్యాన్ని ఏర్పరచుకుని తదనుగుణంగా ప్రక్షాళన చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ఇలాంటి వాస్తవ పరిస్థితులను విస్మరించి మరో ఉద్యమం తప్పదంటూ ఫ్యాప్టో నాయకులు తెరపైకి రావడం సరికాదని చెన్నకేశవరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉద్యమాలకు సిద్ధం కావాలంటూ పిలుపు ఇవ్వడం ఉపాధ్యాయులను బలి పశువుల్ని చేయడం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసే మంచి పనులను కూడా అభినందించలేక స్వార్థంతో నిరంతరం విమర్శలే పనిగా పెట్టుకున్న ఉపాధ్యాయ సంఘాల నేతల వైఖరి ఏమాత్రం సరైంది కాదన్నారు. అందుకే తన పదవులకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

22న ప్రత్యేక లోక్ అదాలత్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న జరిగే ప్రత్యేక లోక్ అదాలత్‌ను న్యాయవాదులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం కోసం08562–258622, 244622 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన షరీఫ్, సత్తెయ్య

గోపవరం : మండలంలోని శ్రీనివాసపురం చెక్‌పోస్టు వద్ద నెల్లూరు – ముంబై (ఎన్‌హెచ్–67) జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సంగసముద్రం గ్రామానికి చెందిన బొలిపి సత్తెయ్య బద్వేలు నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా.. ఎదురుగా మరో బైక్‌లో బద్వేలుకు చెందిన దస్తగిరి, నాగూర్‌బాష, షరీఫ్ వస్తున్నారు. శ్రీనివాసపురం మలుపు వద్ద ఈ వాహనాలు ఢీకొనడంతో వారు నలుగురూ కిందపడ్డారు. అంతలో అతివేగంగా నెల్లూరు వైపు నుంచి బద్వేలు వైపు వెళుతున్న కారు జరిగిన ప్రమాదాన్ని గుర్తించకపోగా వారిపైన దూసుకెళ్లింది. దీంతో బద్వేలుకు చెందిన షరీఫ్, సంగసముద్రంకు చెందిన సత్తెయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. దస్తగిరి, నాగూర్‌బాషలు స్వల్ప గాయలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న బద్వేలు 108 సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హుటాహుటిన బద్వేలు సీమాంక్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో షరీఫ్, సత్తెయ్యలను కడప రిమ్స్‌కు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే బద్వేలు రూరల్ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలను సేకరించడంతోపాటు కారును అదుపులోకి తీసుకున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

చింతకొమ్మదిన్నె : మండల పరిధి 17వ డివిజన్ సీఎంఆర్ పల్లిలోని ఓ ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో సామాగ్రి దగ్ధం అయింది. ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీఎంఆర్ పల్లిలో హరి అనే వ్యక్తికి చెందిన ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని ఫ్రిజ్‌లు, టీవీలతోపాటు సామగ్రి దగ్ధం అయ్యాయి. దాదాపు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

13న గండికోటలో 'అల్లూరి' వర్ధంతి

కడప కల్చరల్ : స్వాతంత్య్ర సమర పోరాటంలో ఆంగ్లేయులకు సింహస్వప్నంగా నిలిచిన అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఈనెల 13న ప్రముఖ పర్యాటక ప్రాంతం గండికోటలో నిర్వహించనున్నారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్, తంజావూరు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, అమరావతి సర్కిల్, విజయవాడల ఉమ్మడి నిర్వహణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కడప సబ్ సర్కిల్ ఆర్కియాలజీ కన్జర్వేషన్ అసిస్టెంట్ పి.బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వాహక బృందంలోని అధికారులు జిల్లా అధికారులను కలిసి అనుమతులు, ఏర్పాట్లపై చర్చించారు. ఈనెల 13న అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు, ఇందులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని అధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు. సాయంత్రం 3.30 గంటలకు గండికోట ప్రధాన ద్వారం వద్ద నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులు, పర్యాటకాభిమానులు, స్థానిక ప్రజలతో కోటలోని జుమ్మా మసీదు వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జుమ్మా మసీదు వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగంగా విభిన్నమైన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

స్థల వివాదంతోనే స్థిరాస్తి వ్యాపారి హత్య

- పంచాయితీకి పిలిచి దాడి చేసిన వైనం
- తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన రామమోహన్‌రెడ్డి
- నిందితుడు మేకల జగన్‌మోహన్ రెడ్డి ఎర్రగుంట్ల బీజేపీ మండల ఇన్‌చార్జి


మృతుడు రామమోహన్‌రెడ్డి


బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డితో కలిసి కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన మేకల జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : స్థల వివాదమే స్థిరాస్తి వ్యాపారి రామమోహన్‌రెడ్డి (48) హత్యకు కారణంగా పోలీసులు నిర్ధారణ చేశారు. పట్టణంలోని మోడంపల్లెకు చెందిన గుమ్మల్ల రామమోహనరెడ్డి సోమవారం రాత్రి హత్యకు గురైన విషయం తెలిసిందే. అతను ఆరోగ్యం సరిగా లేక మృతి చెందాడని పోలీసులు ముందుగా భావించారు. అయితే దాడికి గురై మృతి చెందినట్లు తర్వాత నిర్ధారణ అయింది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మల్ల రామమోహన్‌రెడ్డి ప్రొద్దుటూరులోని మోడంపల్లెలో సోదరి శాంతమ్మతో కలిసి ఉంటున్నాడు. అతనికి వివాహం కాలేదు. కొన్నేళ్ల నుంచి స్థలాల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో శాస్త్రీనగర్‌లో నివాసం ఉంటున్న మేకల జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన 5 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసే నిమిత్తం 11 ఏళ్ల క్రితం కొంత నగదు చెల్లించి అగ్రిమెంట్ రాయించుకున్నాడు. మిగిలిన మొత్తం చెల్లిస్తానని, రిజిస్టర్ చేయించాలని పలుమార్లు అడిగినా అతను పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. అగ్రిమెంట్ డబ్బు వాపసు ఇవ్వకుండా, రిజిస్టర్ చేయించకుండా అతన్ని ఇబ్బందులకు గురి చేసేవాడు. ఈ విషయమై రామమోహన్‌రెడ్డి బంధువుల వద్ద చెప్పుకుంటూ బాధపడేవాడు. స్థలం విషయమై అనేక సార్లు పంచాయితీలు కూడా జరిగాయి.

దేవగుడి రామాంజనేయరెడ్డి ఆఫీసులో దాడి

వివాదంగా ఉన్న స్థలానికి సంబంధించి పంచాయితీకి రావాలని పిలవడంతో సోమవారం సాయంత్రం రామమోహన్‌రెడ్డి జమ్మలమడుగు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి పక్కన ఉన్న దేవగుడి రామాంజనేయరెడ్డి ఆఫీసుకు వెళ్లాడు. అతనితోపాటు ప్రొద్దుటూరుకు చెందిన శేఖర్, భాస్కర్ అనే ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారు. అక్కడి కార్యాలయంలో రామమోహన్‌రెడ్డి, మేకల జగన్‌మోహన్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే జగన్‌మోహన్‌రెడ్డితోపాటు కొందరు వ్యక్తులు రామమోహన్‌రెడ్డిపై దాడి చేశారు. రామమోహన్‌రెడ్డికి గుండెదడ, షుగర్ వ్యాధి ఉన్నాయని అక్కడి వారు చెప్పినా అతను వదిలి పెట్టలేదు. వారి దాడిలో ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురైన రామమోహన్‌రెడ్డిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ చూసే లోపు అతను మృతి చెందాడు. తన తమ్ముడి చావుకు కారణమైన మేకల జగన్‌మోహన్‌రెడ్డితోపాటు మరి కొందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శాంతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ నారాయణ యాదవ్ తెలిపారు.

ప్రధాన నిందితుడు ఎర్రగుంట్ల బీజేపీ ఇన్‌చార్జి

ఈ కేసులోని ప్రధాన నిందితుడు మేకల జగన్‌మోహన్‌రెడ్డి ఎర్రగుంట్ల మండలం బీజేపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. అతను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డికి ముఖ్య అనుచరుడు. ఆయన స్వగ్రామం కమలాపురం మండలంలోని సి రాజుపాళెం. ప్రస్తుతం ప్రొద్దుటూరులోని శాస్త్రినగర్‌లో నివాసం ఉంటూ రామేశ్వరంలో బార్ నిర్వహిస్తున్నాడు.

బంగారు వ్యాపారుల నుంచి రూ.37,97,500 స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదుతో సీఐ రాజారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : తాడిపత్రికి చెందిన ఇద్దరు బంగారు వ్యాపారుల నుంచి ఎలాంటి రశీదులు లేకుండా తీసుకెళ్తున్న రూ.37,97,500 నగదును వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అమ్మవారిశాల సమీపంలోని వాసు స్టూడియో జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి తాడిపత్రికి చెందిన బంగారు వ్యాపారులు షాబుద్దీన్, షేక్షావలిలు అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీఐ రాజారెడ్డి, ఎస్ఐ అమర్నాథరెడ్డిలు సిబ్బందితో కలసి తనిఖీలు చేశారు. ఒక వ్యక్తి బ్యాగులోను, మరో వ్యక్తి నడుముకు గుడ్డ బెల్ట్ కవర్‌లో నోట్ల కట్టలు కలిగి ఉన్నారు. ఈ డబ్బుకు సంబంధించి వ్యాపారులు ఎలాంటి రశీదులు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకొని తదుపరి చర్యల నిమిత్తం ఇన్‌కంట్యాక్స్ అధికారులకు పంపించినట్లు సీఐ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్న సీఐ రాజారెడ్డి, ఎస్ఐ అమర్నాథరెడ్డి, సిబ్బందిని ఏఎస్పీ ప్రేరణా కుమార్ అభినందించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి


మైదుకూరు : విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి

మైదుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మైదుకూరు మండలంలో పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వనిపెంటలోని జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో డైనింగ్ హాల్, భోజనాన్ని పరిశీలించారు. వనిపెంటలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, మైదుకూరులోని గాంధీ నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మైదుకూరులో రెండు రేషన్ షాపులను తనిఖీ చేసి సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్ బాలురు, బాలికల విభాగాలను తనిఖీ చేశారు. బాలికల హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆయన స్వయంగా భోజనాన్ని వడ్డించారు. వసతుల గురించి ఎంఈఓ పద్మలత, హెడ్మాస్టర్ గంగా భవానితో మాట్లాడారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ సురేష్, తహసీల్దార్ అనురాధ, డీటీ మల్లికార్జున తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎర్రగుంట్ల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తర్వాత విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఓ విద్యార్థి తండ్రి పెట్టిన ఫిర్యాదు మేరకు వచ్చానన్నారు. ఇక్కడ భోజనం సరిగ్గా లేదని పిల్లలు తెలియజేశారన్నారు. తర్వాత పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయరెడ్డితో సమావేశమై సూచనలు, సలహాలు అందించారు.

సరైన తూకంతో బియ్యం ఇవ్వాలి

పులివెందుల రూరల్ : ఎండీయూ ఆపరేటర్లు ప్రజలకు రేషన్ బియ్యాన్ని సరైన తూకంతో ఇవ్వాలని, ప్రతి ఏడాది త్రాసులకు మోర్ వేయించుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హాస్టల్ వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం హాస్టల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీడీ సురేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, సీడీపీఓ శ్రీలత, ఎంఈఓ వీరారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా, ఆర్ఐ సుజిత్, వార్డెన్లు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి గురుకుల పాఠశాల తనిఖీ

కమలాపురం : కమలాపురంలోని బాలయోగి గురుకుల పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. వంట గది, డార్మెంటరీ, డైనింగ్ హాల్, సరుకులు, కూరగాయలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం సరిగా చేయడం లేదని, మిగిలిన అన్నాన్ని పందుల యజమానులు తీసుకెళ్తున్నారని తనకు ఫిర్యాదు వచ్చిందన్నారు. కేర్ టేకర్ శ్రద్ధ చూపి వంటలు రుచికరంగా చేసేలా చూడాలన్నారు. అనంతరం పట్టణంలోని 5వ రేషన్ షాపును పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్‌ఓ రవిశంకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నమెంట్


77 పరుగులు చేసిన భవానీప్రసాద్


5 వికెట్లు తీసిన బౌలర్ చినబాబు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో జరుగుతున్న ఏసీఏ–సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కడప 73 ఓవర్లలో 222 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని రణధీర్‌రెడ్డి 65, గురుచరణ్ 41 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ చిన్నబాబు 5, సుతేజ్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 56 పరుగులు చేసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు 54.4 ఓవర్లలో చిత్తూరు జట్టు 191 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని భవానీప్రసాద్ 77 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు ప్రతాప్‌రెడ్డి 3, లోహిత్‌సాయికిశోర్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 59, వీరారెడ్డి 50 పరుగులు చేశారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక టెక్నాలజీని అందించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. శిక్షణ ఫలాలను అందించి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి పేద విద్యార్థికి డిజిటల్ విద్యను అందించాలనే దృఢ లక్ష్యంతో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీఎస్‌లు అందిస్తున్నారన్నారు. ఎంఈఓ నారాయణ, పర్యవేక్షణ అధికారి రమణ, సంయుక్త కోఆర్డినేటర్లు రమణమూర్తి, ఇమామ్‌ఖాసీం, కళాశాల సాంకేతిక నిపుణులు డాక్టర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. కడక కలెక్టర్ కార్యాలయ సభాభవన్‌లో ఎంఈఓ అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్‌లతోపాటు హెచ్‌ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్‌పీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈఓ కార్యాలయ టెక్నికల్ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, జ్వాలపతిలు యూడైస్ ప్లస్, చైల్డ్ ఇన్ఫో, టీచర్స్, స్టూడెంట్స్ అటెండెన్స్‌పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఏడీ దేవరాజు, ఎంఈఓ అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. రామాంజనేయపురం సమీపంలో నివసిస్తున్న గంగన్న కుమార్తె సంగీత (15) ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. రోజూ పాఠశాలకు వెళ్లేది. మంగళవారం పాఠశాల తరగతులు ముగిసిన తర్వాత తన తండ్రికి ఫోన్ చేసి కడుపునొప్పి అధికంగా ఉందని చెప్పింది. తండ్రి వచ్చేలోగా నొప్పి తాళలేక పాఠశాల సమీపంలోని ఓ అపార్టుమెంటు పైకి ఎక్కి కిందికి దూకింది. ఆ సమయంలో మట్టిదిబ్బలపై పడింది. గాయాలు కావడంతో చుట్టుపక్కల వారు గమనించి హోలిస్టిక్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సంగీత ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. సమగ్రంగా దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని వారు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 'ట్రిపుల్ ఐటీ' ప్రతిభ


అధ్యాపకుడు, విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ సంధ్యారాణి

వేంపల్లె : హాంకాంగ్‌లో ఈ నెల 24వ తేదీ నుంచి 30 వరకు జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వారిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భౌతిక శాస్త్ర అధ్యాపకులు బాల గోవిందు తివారి 93 కేజీల మాస్టర్–2 విభాగంలో 650 కేజీల బరువును ఎత్తి రెండు జాతీయ రికార్డులు నెలకొల్పి నాలుగు బంగారు పతకాలు, ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఎం.జ్యోతి 43 కేజీల జూనియర్ విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ చాంపియన్స్‌గా నిలిచారన్నారు. బాల గోవిందు తివారి ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు విజయనగరం జిల్లాలోని రాజం జీఎంఆర్‌ఐటీ కళాశాలలో జరగనున్న జాతీయ మాస్టర్స్ ఎక్విప్డ్, క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో మన రాష్ట్రం తరపున 93 కేజీల మాస్టర్ –2 విభాగంలో ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. అంతర్జాతీయస్థాయి పోటీలలో ప్రతిభ చూపిన వారికి కళాశాల చాన్స్‌లర్ కె.సిరెడ్డి, వైస్ చాన్స్‌లర్ విజయ్‌కుమార్, డైరెక్టర్ కె.సంధ్యారాణి, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, అధ్యాపకలు అభినందనలు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మైదుకూరు : ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు నివారణ మందులను రైతులకు విక్రయిస్తున్నట్టు తేలితే చర్యలు తీసుకుంటామని కడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. మంగళవారం మైదుకూరులో వారు పలు దుకాణాలను తనిఖీ చేశారు. బద్వేలు రోడ్డులోని శ్రీవెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీస్, శ్రీ ప్రణీత ఆగ్రో ఏజెన్సీస్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. వెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీస్ దుకాణంలో మిరప రకం 6.57 కిలోల విలువ రూ.2,49,660 ఇన్వాయిస్ స్టాక్ రికార్డులో ఎంట్రీ చేయనందున ఫిజికల్ స్టాక్‌పై సీడ్స్ యాక్ట్ ప్రకారం అమ్మకాలను నిలుపుదల చేశారు. అదే విధంగా ప్రణీత ఆగ్రో ఏజెన్సీస్‌లో ఈషా వెరైటీ–245 10 ప్యాకెట్లు అమ్మకపు బిల్లులు ఇచ్చి స్టాక్ రిజిస్టార్‌లో నమోదు చేయనందున ఫిజికల్ స్టాక్‌పై, స్టాక్ రిజిస్టర్‌లో అప్‌డేట్ చేయనందున రూ.1,71,520 విలువైన స్టాక్ అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, భౌతిక విలువను పరిశీలించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలపై తమ దృష్టికి తీసుకొస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాక దుకాణాలను సీజ్ చేయడం జరుగుతుందని కడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈదుర్ బాషా, ఏఓ బాలగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో మైదుకూరు మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రులకు అందిస్తున్న సేవలు మరువలేనివి


వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యే

కడప కార్పొరేషన్ : గల్ఫ్ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులకు ఏపీఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ అందిస్తున్న సేవలు మరువలేనివని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో ఎన్నారైలు అన్సర్ బాషా, షేక్ గయాజ్, బాబుబాయ్, ఉస్మాన్‌బాషా, రాజాసాబ్‌ల ఆధ్వర్యంలో రెండోసారి గల్ఫ్ కన్వీనర్‌గా నియమించినందుకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రులను ఏకం చేసి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఇలియాస్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అనంతరం బీహెచ్ ఇలియాస్ మాట్లాడుతూ ఎన్నారై గ్రూప్ సహకారంతోనే తాను ఏపీఎన్ఆర్‌టీఎస్‌లో సేవలందించానన్నారు. ఏ పార్టీలో దక్కని గౌరవం తనకు వైఎస్సార్‌సీపీలో లభించిందన్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు అందించిన సహకారం ఎంతో ఉందన్నారు. గల్ఫ్ దేశాలలో ప్రవాసాంధ్రులకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు, ప్రమాదాలు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపుతున్నారని, అయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ ఎస్.మహేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అఫ్జల్‌ఖాన్, హఫీజుల్లా, డాక్టర్ సొహైల్, కె. సూర్యనారాయణరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా కీలు మార్పిడి


ఆపరేషన్ తరువాత వాకర్ సాయంతో నడుస్తున్న నాగలింగేశ్వరరెడ్డి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలోని క్యాంబెల్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఎడమ కాలు తుంటి కీలు మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన నాగలింగేశ్వరరెడ్డికి కొంత కాలంగా కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉండేవి. దీంతో అధిక శాతం స్టెరాయిడ్, మాత్రలు ఎక్కువ వాడటంతో నాగలింగేశ్వరరెడ్డి తీవ్రంగా ఇబ్బందులు పడ్డాడు. పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాడు. ఎక్కువ డబ్బులు ఖర్చు అవుతాయని డాక్టర్లు సూచించారు. ఆపరేషన్ నిర్వహించాలంటే దాదాపు రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు సూచించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబం కావడంతో ఆపరేషన్ చేయించుకోవడానికి అంత డబ్బులు లేకపోవడంతో.. పలువురు ఇచ్చిన సలహా మేరకు జమ్మలమడుగు పట్టణంలోని క్యాంబెల్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. వైద్యులు సోమవారం అన్ని పరీక్షలు నిర్వహించారు. అనంతరం రాత్రి క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ డాక్టర్ మోసిన్ కమాల్.. ఎడమకాలు గజ్జల్లో తుంటి కీలు మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం నాగలింగేశ్వరరెడ్డిని వైద్యులు వాకర్ సాయంతో నడిపించడం జరిగింది. దీంతో కుటుంబసభ్యులు ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టిన దివంగత నేత రాజశేఖర్‌రెడ్డిని, మెరుగైన సేవలతో అమలు చేస్తున్న తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వారు కొనియాడారు. ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.